క్లుప్తంగా

ప్రజల చెంతకే వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం మండలంలోని పొలకలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారంతో పాటు వైద్య సిబ్బంది అందించే ఐరన్ మాత్రలు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఈడిగలకు ప్రాధాన్యత ఇవ్వండి



మాట్లాడుతున్న సంఘ నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మద్యం షాపుల కేటాయింపులో కల్లుగీత కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఈడిగ గౌడ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల గోపి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు మద్యం దుకాణాల కేటాయింపులో కల్లుగీత కార్మికులకు పదిశాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రస్తావనే ఇప్పుడు లేదన్నారు. యాదమరి మండలంలో ఏడు వేల కల్లుగీత కార్మికుల కుటుంబాలు ఉన్నాయన్నారు. ఇందులో చాలా కుటుంబాలు కల్లుగీతపైన ఆధారపడి ఉన్నాయని తెలిపారు. తమకు ప్రభుత్వం కేటాయిస్తున్న మద్యం దుకాణాల్లో పది శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు వెంకటేష్, లోకేష్, జగదీష్ తదితరులు ఉన్నారు.

33 కేవీ లైన్ల తనిఖీ



పేటమిట్ట సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఏడీఈ

పూతలపట్టు: మండలంలోని ఏడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 33 కేవీ లైన్లను పాకాల నుంచి పూతలపట్టు వరకు ఏడీఈ శేషాద్రి రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఉదయం 132 కేవీ సబ్‌స్టేషన్ల నుంచి 25 కిలోమీటర్ల మేర కాలినడకన ప్రతి విద్యుత్ స్తంభాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పేటమెట్ట సబ్‌స్టేషన్ తనిఖీ చేసి రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యుత్ సమస్యల పరంగా ఆపరేటర్లకు పలు సూచనలు అందించారు. 33 కేవీ లైన్లకు దగ్గరలో ఉన్న చెట్లను గుర్తించారు. పలు ఫెయిల్యూర్ ఇన్సులేటర్లను తనిఖీ చేసి వాటిస్థానంలో అప్పటికప్పుడే కొత్తవి ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బందికి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈ నరసింహులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కాణిపాకంలో సీఎం ముఖ్య కార్యదర్శి



స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని మంగళవారం సీఎం ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో ఆయనకు స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, ఆర్టీఓ శ్రీనివాసులు, సిబ్బంది వాసు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

చిత్తూరు కార్పొరేషన్: హర్యానా రాష్ట్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడంపై ఆ పార్టీ జిల్లా నాయకులు చిట్టిబాబు హర్షం వ్యక్తం చేశారు. తమ పార్టీ చేపట్టిన సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అభివృద్ధి ప్రణాళిక మంచి ఫలితాలను ఇచ్చిందన్నారు. ఓబీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రి స్థానంలో నియమించబోతున్న అంశం భారతీయ జనతా పార్టీకే సాధ్యమన్నారు. అలాగే జమ్మూ కాశ్మీర్‌లో గతంలో కంటే రెండు స్థానాలు అధికంగా వచ్చాయన్నారు.

అడ్రస్ లేని పోస్ట్‌కార్డు



ఒకప్పుడు పెళ్లి, చావు, పుట్టినరోజు, సీమంతం, జన్మదిన వేడుకలు, నూతన సంవత్సర, పండుగల శుభాకాంక్షలు, వేల కిలోమీటర్ల అవతల ఉన్న వ్యక్తులకు క్షేమ సమాచారాలు తెలపాలంటే తపాలా ఒకటే సమాచారం సాధనం. వీధుల్లో పోస్ట్‌మ్యాన్ వస్తున్నాడు అంటే అరుగు మీద కూర్చున్న వారు ఎవరింటికి ఉత్తరం వస్తాదో అని చూసేవారు. అప్పట్లో పోస్ట్‌మ్యాన్‌లు చదువు రాని వారికి ఉత్తరం చదివి వినిపించేవారు. కొందరు ఉత్తరాలను భద్రంగా దాచుకునేవారు. ప్రస్తుతం ఉత్తరం రాసేవారు కరువయ్యారు. అంతా సోషల్‌మీడియా హవా సాగుతోంది.

- ఒకనాటి సమాచార సాధనం పోస్ట్‌కార్డు
- సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక కనుమరుగు
- 9న ప్రపంచ తపాలా దినోత్సవం





కనుమరుగవుతున్న పోస్ట్‌బాక్స్, తపాలా సేవల్లో పోస్ట్‌మ్యాన్

చిత్తూరు కార్పొరేషన్: నాటి రోజులు మధుర జ్ఞాపకాల్లా మిగిలిపోయాయి. నేటి సమాజంలో పిల్లలకు పోస్టుల్లో ఉత్తరం వచ్చి దానిని చదువుకుని ఎంతో తృప్తి చెందేవారమని పెద్దలు చెబుతుంటారు. కాలానుగుణంగా మార్పులు మంచిదే కానీ..గత జ్ఞాపకాలను తక్కువ అంచనా వేయడానికి వీలు లేదు. పెద్దలైతే మహారాజశ్రీ, చిన్నవారైతే చిరంజీవి..అని మహిళలను లక్ష్మీ సమానులని.. వితంతువులైతే గంగాభాగీరథీ సమానులైన అని సంబోధించే వారు. అలాగే ఉత్తరం ముగింపులో కూడా పెద్దలకు నమస్కారంతో అని, చిన్నవారికి ఆశీస్సులతో అని రాసేవారు. ఎవరైనా కాలం చేసిన వార్తను ఉత్తరం ఒక వైపున నలుపు రంగు ఉండేలా చూసేవారు. ఆ ఉత్తరాన్ని ఇంట్లోకి తీసుకెళ్లకుండా బయటనే చించివేసేవారు. గతంలో ఉత్తరాలు రాసుకుని అందులోని ముఖ్యమైన సమాచారం ఉంటే ఒక కమ్మికి కట్టి ఉంచేవారు. మునకం చేసుకుంటూ మరో ఉత్తరం వచ్చేవరకు ఎదురుచూడడం ఎంతో చక్కగా ఉండేవి.

నాడు లక్షల్లో ప్రింట్..

అప్పట్లో జిల్లా పరిధిలో ఏడాదికి లక్షల్లో పోస్టల్ కార్డులను ప్రింట్ చేసేవారు. ప్రస్తుతం నెలకు జిల్లాలో 20వేల పోస్టు కార్డుల పైగా అమ్ముడవుతున్నాయి. అవి కూడా వ్యాపార నిమిత్తం ఎక్కువగా వాడుతున్నారు. వీటిలో అధికంగా కుదువ వ్యాపారస్తులు వినియోగదారులకు నోటీసులు ఇవ్వడానికి వాడుతున్నట్లు తెలుస్తోంది. ఒక పోస్టుకార్డు తయారీకి రూ.3.80 ఖర్చు అవుతుండగా దాన్ని వినియోగదారులకు కేవలం 50 పైసలకే అందజేస్తున్నారు.

స్మార్ట్‌ఫోన్ రాకతో మాయం..

అయితే నేటి యువత చేతిలోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్ గంటల తరబడి వాడుతున్నప్పటికీ అవతల వారి పూర్తి యోగ క్షేమాలు మాట్లాడే పరిస్థితి కూడా లేదు. ఒకటి రెండు మాటలు మాట్లాడిన తర్వాత వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, యూట్యూబ్, ఇలా వేరే వ్యాపకాల్లోకి జారుకుంటున్నారు. ఉత్తరాలు రాసుకునే సమయంలో మరో ఉత్తరం వచ్చేవరకు ఎదురు చూపులు ఉండేవి. సమయం లేక రాయలేని వారికి ఉత్తరం రాసి ఎన్ని రోజులు అయిందో అని దిగాలు పడేవారు. కానీ నేడు స్మార్ట్‌ఫోన్ రాకతో ఉత్తరాలు ఊసే లేకుండా పోయింది.

తపాలా వారోత్సవాలు..

జిల్లావ్యాప్తంగా తపాలా వారోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి 13 వరకు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 9న ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నిచోట్లా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

కాలానుగుణంగా మార్పు



"పాతకాలం వారికి ఉత్తరం ఒక జ్ఞాపకం.. ఇప్పటికీ పలువురు పోస్టాఫీస్‌కి వచ్చి ఉత్తరాలు రాస్తున్నారు. ఆ అనుభూతులను కొందరు మరిచిపోవడం లేదు. కాలానుగుణంగా సమాచార సాధనంలో మార్పు వచ్చింది. తపాలాసేవలను గుర్తు చేసుకోవడానికి వారోత్సవాల ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. శాఖ ఉద్యోగులు మా సేవలపై ప్రచారం నిర్వహిస్తారు. విద్యార్థులకు పోటీలు పెట్టి బహుమతులు అందజేయనున్నాం.

- లక్ష్మణ, సీనియర్ సూపరింటెండెంట్, తపాలాశాఖ

పెద్దిరెడ్డికి జ్ఞాపిక



మాజీ మంత్రి పెద్దిరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న లక్ష్మిపతి, కోటీశ్వరమొదలియార్

చిత్తూరు కార్పొరేషన్: మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాష్ట్రీయ వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మిపతి కలిసి జ్ఞాపికను అందజేశారు. మంగళవారం తిరుపతిలో సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలసుందరం, మొదలియార్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కోటీశ్వర మొదలియార్‌తో కలిసి మాట్లాడారు. అధికారం లేకున్నా ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే వారే నిజమైన నాయకులుగా గుర్తింపు పొందుతారని పెద్దిరెడ్డి తెలియజేశారని తెలిపారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారి సాగరిక

ఐరాల: ఉద్యాన పంటల సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని ఉద్యానశాఖ అధికారి సాగరిక అన్నారు. మంగళవారం మండలంలోని పుత్రమద్ది, మిట్టూరు గ్రామాల్లో ఏఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యాన పంటలను సాగు చేయడం వల్ల తక్కువ నీటి వనరులతో మంచి దిగుబడులు సాధించవచ్చన్నా రు. ఆ దిశగా రైతులు దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం పండ్ల తోటల విస్తరణ పథకం ద్వారా మామిడి, జామ, దానిమ్మ, బొప్పాయి, టిష్యూ కల్చర్ అరటి, డ్రాగన్ ఫ్రూట్, అత్తి(ఫిగ్), అవకాడో, ఫాషన్ ఫ్రూట్, సీతాఫలం తదితర పంటలకు సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితుల్లో మామిడిలో మంచి దిగుబడుల కోసం మామిడి పంటలు సాగు చేసే రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. భూసారం పెంచుకోవడంతో పాటు ఈ సమయంలో ఆశించే చీడపీడల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొత్త చిగురు తొడిగే దశలో ఉన్నందున వర్షాల కారణంగా మచ్చకొమ్మ తెగులు, మచ్చ బూడిద తెగులు సోకే అవకాశం ఉందన్నారు. అలాగే డిసెంబర్, జనవరిలో తేనే మంచు పురుగు ఆశించే పరిస్థితి ఉంటుందన్నారు. వీటి నివారణ చర్యలను ఆమె వివరించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ రామచైతన్య, వీఏఏలు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్లు

ఐరాల: గ్రామాల్లో అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు అరికట్టడంలో ఆశాకార్యకర్తలు నిర్వర్తించే పాత్ర కీలకమైనదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్లు శిరీష, కిరణ్‌నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ఆశాకార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో జ్వరాలు, వ్యాధులు ప్రబలినప్పుడు వెంటనే సంబంధిత వైద్యాధికారులకు సమాచారం అందించడంతో పాటు ప్రాథమిక చికిత్స అందించాలన్నారు. గ్రామాల్లో ఇంటింటా పర్యటిస్తూ పారిశుద్ధ్యం లోపించకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించాలని తెలిపారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం దివ్యాంగులకు వీల్‌చైర్లు, వాకింగ్ స్టిక్స్, నెక్ బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పూర్ణలత, సీహెచ్ఓ ఆదిలక్ష్మి, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే, ఈఓ

కాణిపాకం: నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడలోని శ్రీకనకదుర్గమ్మకు మంగళవారం కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఈఓ గురుప్రసాద్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి దర్శించుకున్నారు.

వృత్తి విద్యపై మక్కువ పెంచుకోవాలి



శిక్షణ తరగతులను తనిఖీ చేస్తున్న ఇంద్రాణి

రొంపిచెర్ల: వృత్తి విద్యపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని జిల్లా బాలిక సంరక్షణ అధికారి ఇంద్రాణి అన్నారు. రొంపిచెర్ల ఉర్దూ ఉన్నత పాఠశాలలో వేసవి సెలవుల్లో జరుగుతున్న ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో ఇంటర్న్‌షిప్ చేయడం వల్ల ఉన్నత చదువులకు దోహద పడుతుందన్నారు. పాఠశాల స్థాయిలో వృత్తి విద్యా కోర్సుల్లో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కళాశాల విద్య ముగిసే సమయానికి విద్యార్థులు వారి కాళ్లపై వారు నిలబడేందుకు పలు విప్లవాత్మక, వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం సిద్ధం చేస్తుందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీసోర్స్‌పర్సన్ శశికుమార్ పాల్గొన్నారు.


లోక నాయకి.. రక్షించు తల్లీ..



బంగారుపాళెం: శ్రీమహాలక్ష్మీ దేవిగా ముత్యాలమ్మ



బంగారుపాళెం: వజ్రాలపురంలో బోయకొండ గంగమ్మ



చిత్తూరు : సరస్వతీదేవిగా దుర్గాంబ



చిత్తూరు :మధుర మీనాక్షి అలంకరణలో అంకాళపరమేశ్వరి

- అమ్మవారి ఆలయాలకు భక్తుల తాకిడి
- వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న అమ్మవారు

బంగారుపాళెం: దేవీనవరాత్రి వార్షిక ఉత్సవాలలో భాగంగా అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. బంగారుపాళెం గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ మంగళవారం శ్రీమహాలక్ష్మిదేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు మురళీ గురుకుల్ అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధ రకాల సుగంధ పుష్పాలతో నయనానందకరంగా అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఉత్సవానికి తగ్గువారిపల్లెకు చెందిన బాబురెడ్డి, గ్రామానికి చెందిన ప్రతాప్‌సేన్, కేసీపీ సిమెంట్ డీలర్ సాంబశివ బ్రదర్స్, ప్రియ, దొరబాబు, శంకర్, ఉభయదారులుగా వ్యవహరించారు.

వజ్రాలపురంలో..

మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులను కటాక్షించారు. వజ్రాలపురం గ్రామానికి చెందిన రాజేశ్వరి రాజగోపాల్ ఉభయదారులుగా వ్యవహరించారు. అదేవిధంగా ఓంశక్తి ఆలయంలో, తగ్గువారిపల్లెలోని దండుమారెమ్మ ఆలయంలో, మొగిలివెంకటగిరిలోని గంగమ్మ ఆలయాల్లో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

చదువుల తల్లిగా దుర్గాంబ..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని గిరింపేట శ్రీదుర్గాంబ దేవస్థానంలో మంగళవారం నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈఓ మునిశేఖర్ పాల్గొన్నారు. గుర్రప్పనాయుడువీధిలోని అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉదయం పండ్ల అలంకరణ, రాత్రి మధురమీనాక్షి అలంకరణలో కనువిందు చేశారు. కోదండరామస్వామి ఆలయంలో వామనవాతరం, శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో మహాలక్ష్మిగా అభయమిచ్చారు.

సత్యమ్మకు ప్రత్యేక పూజలు..

తవణంపల్లె: మండలకేంద్రంలోని సత్యమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టారు.

లక్ష్మీదేవిగా పాలేటమ్మ..

ఐరాల: గ్రామ దేవత పాలేటమ్మ అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వైఎస్ గేటులోని చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా అలంకరణలో దర్శనమిచ్చారు.

శ్రీమహాలక్ష్మిదేవి అలంకరణలో అమ్మవారు


శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లిలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మకు వేకువజామున అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉదయం 9 గంటలకు శ్రీనీల గణపతి షోడశపూజ, శ్రీమహాలక్ష్మిదేవి హోమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పుష్పయాగానికి అమ్మవారికి పుష్పాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు.



చిత్తూరు: మహాలక్ష్మీ అలంకరణ



లక్ష్మీదేవిగా పాలేటమ్మ



దుర్గాదేవిగా చాముండేశ్వరి



పుష్పయాగానికి పుష్పాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఉభయదారులు

పేదలకు అందుబాటులో వైద్య సేవలు



వృద్ధులకు వైద్యం అందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు



మైనగుండ్లపల్లెలో..

తవణంపల్లె: గ్రామాల్లో ప్రజల వద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మంగళవారం మండలంలోని సరకల్లులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ 45 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలు ఇచ్చారు. జ్వరాలు సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని తెలిపారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తినాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య బృందం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కేశవ నారయణ సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండంలోని మైనగుండ్లపల్లెలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 104 మొబైల్ క్లినిక్‌లో గర్భిణులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో సాగు చేయండి



క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

తవణంపల్లె: అధునాతన పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి సాధించవచ్చని ఏఓ ప్రవీణ్ రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని జెట్టిపల్లె, పల్లెచెరువులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని, అలాగే విత్తనశుద్ధి చేయడం వల్ల చీడపీడలను నివారించవచ్చన్నారు. మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఎరువులు అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో ముందస్తుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ, వెటర్నరీ సిబ్బంది, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వచ్చిన కేసులన్నీ రెఫర్ చేస్తే ఎలా?



తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్ ప్రభావతి

పలమనేరు: జిల్లాలోనే సువిశాలమైన ఆస్పత్రి, అవసరమైన వైద్యులు, సిబ్బంది ఉన్న పలమనేరు ఆస్పత్రి నుంచి రాత్రిపూట అత్యవసర రోగులకు నైట్ డ్యూటీ డాక్టర్లు ఎందుకు రెఫర్ చేస్తున్నారంటూ డీసీహెచ్ఎస్ ప్రభావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి రికార్డులను, ఓపీని పరిశీలించారు. అత్యవసర విభాగంలోని రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల పలు దినపత్రికల్లో ఇక్కడి ఆస్పత్రిల్లో రెఫర్లే దిక్కంటూ కథనాలు వస్తున్నందున తాను తనిఖీ చేద్దామని వచ్చానన్నారు. ఇక్కడ పరిస్థితి చూస్తుంటే అందరూ అనుభవం ఉన్న వైద్యులే ఉన్నప్పటికీ ఎందుకు రెఫర్ చేస్తున్నారని అక్కడి వైద్యులను ప్రశ్నించారు. ఇకపై సాధ్యమైనంతవరకు రెఫర్‌లు లేకుండా వైద్యాన్ని అందించాలని సూచించారు. ముఖ్యంగా ఇక్కడి డాక్టర్లు, సిబ్బంది సమయపాలన విధిగా పాటించాలని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ మమతారాణి, ఆర్ఎంఓ శారద పాల్గొన్నారు.

సాగు ఖర్చులను నియంత్రించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీ

శాంతిపురం: రైతులు లాభసాటి వ్యవసాయం కోసం సాగు ఖర్చులను క్రమంగా తగ్గించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ అన్నపూర్ణమ్మ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె కడపల్లి, కదిరిఓబనపల్లి, పాకంపల్లి గ్రామాల వద్ద రైతుల శిక్షణలో పాల్గొన్నారు. రసాయనాల వినియోగాన్ని నియంత్రిస్తూ సేంద్రియ సేద్యం, పద్ధతులను పాటించాలని చెప్పారు. పంటల సాగులో పురుగుమందులు, ఎరువుల కోసం అధికంగా ఖర్చు అవుతుందన్నారు. వీటిని అధిగమించేందుకు నామమాత్రపు ఖర్చుతో సేంద్రియ మందులను, ఎరువులు రైతులే తయారు చేసుకోవచ్చన్నారు. దీని కోసం జెడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకుల సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అప్పాజీ, సెరికల్చర్ ఎస్ఓ రవీంద్రారెడ్డి, రైతు సమాచార కేంద్ర సిబ్బంది గోవర్ధన్, నవీన్, మునెమ్మ పాల్గొన్నారు.